జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com





# నకిలీ నోట్ల చలామణీ

* ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో చేతులు మారుతున్న దొంగనోట్లు
* నిఘా పెట్టి గుట్టురట్టు చేసిన పోలీసులు
* రెండు పీఎస్‌ల పరిధిలో ఎనిమిది మంది అరెస్టు
* అరకోటికి పైగా నకిలీ కరెన్సీ సీజ్
* జిల్లాలో కలకలం

**మెళియాపుట్టి, డిసెంబర్ 13 (వార్త):** జిల్లాలో నకిలీ కరెన్సీ చలామణి జోరుగా సాగుతోంది. కొందరు వ్యక్తులు అసలును తలపించేలా దొంగనోట్లను తయారు చేసి ముఠాగా ఏర్పడి దందాలు చేస్తున్నారు. దీనిపై జిల్లా పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు కొద్ది రోజులుగా ఈ ముఠాపై నిఘా పెట్టి ఈ నకిలీ దందా గుట్టురట్టు చేశారు. మెళియాపుట్టి, జి.సిగడాం పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగనోట్లు చలామణి చేస్తున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ దొంగనోట్ల వ్యవహారం జిల్లా అంతటా చర్చనీయాంశమైంది. ఈ దొంగనోట్ల చలామణి విషయమై మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం టెక్కలి డీఎస్పీ డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి మీడియా సమావేశంలో వివరాలు అందించారు. పలాస మండలం నర్సిపురం గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి రవి అనే వ్యక్తి 50వేల రూపాయల నకిలీ నోట్లతో పట్టుపురం గ్రామం వద్ద వేరొకరికి ఇవ్వడానికి వేచి ఉన్న సందర్భంలో మెళియాపుట్టి ఎస్సై రమేష్ బాబు సిబ్బందితో కలిసి అతనిని అదుపులోకి తీసుకున్నారు. తనదైనశైలిలో విచారణ చేయగా, నకిలీ కరెన్సీ వ్యవహారానికి సంబంధం ఉన్న మిగతా ఐదుగురు వ్యక్తులు పలాస మండలం, పెదంచెల గ్రామానికి చెందిన కుసిరెడ్డి దుర్వాసులు, మెళియాపుట్టి మండలం, సంతలక్ష్మీపురం గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి ఢిల్లీ రావు, దాసరి కుమారస్వామి, కరజాడ గ్రామానికి చెందిన దాసరి రవికుమార్, దోకులపాడు గ్రామానికి చెందిన దుమ్ము ధర్మారావులను పట్టుకున్నారు. వారి నుంచి 57.25 లక్షల రూపాయల నకిలీ కరెన్సీని, దీని తయారీకి ఉపయోగించిన కలర్ జిరాక్స్ మిషన్, దానికి సంబంధించిన ఇతర సామగ్రితో పాటు నాలుగు సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం సైతం పోలీసులు స్వాధీనపరుచుకున్నారన్నారు.

అయితే వీరందరూ కలిసి ఓ వ్యక్తి దగ్గర ఐదు లక్షల రూపాయలకు.. 25 లక్షల నకిలీ కరెన్సీ నోట్లు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఒరిస్సా నుండి తీసుకువచ్చిన కలర్ ప్రింటర్, పేపర్స్ ఇతర సామాగ్రిని తీసుకువచ్చి నకిలీ నోట్లు తయారు చేయడం ప్రారంభించారు. నకిలీ కరెన్సీ ఇచ్చే క్రమంలో పోలీసులకు చిక్కడంతో మొత్తం వ్యవహారం బయటికి రావడంతో అరెస్టయ్యారన్నారు. ఈ ముద్దాయిల్లో తమ్మిరెడ్డి రవి, కుసిరెడ్డి దుర్వాసులపై గతంలో పలాస పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందని, అదేవిధంగా దుమ్ము ధర్మారావుపై మందస, కాశీబుగ్గ, మెళియాపుట్టి, పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాల కేసులు సైతం నమోదయినట్లు డీఎస్పీ తెలిపారు. వారిని అరెస్టు చేసి టెక్కలి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఇంకా దీనికి సంబంధించి ఇంకొంతమంది దొరకాల్సి ఉందని వారిని పట్టుకునే దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నకిలీ కరెన్సీ ప్రక్రియకు సంబంధించిన ముఠాను చాకచక్యంతో పట్టుకున్న మెళియాపుట్టి ఎస్ఐ రమేష్ బాబు, పాతపట్నం సీఐ రామారావు, స్థానిక సిబ్బంది కె. వైకుంఠరావు, పి. జగన్, బి. రమేష్, ఎస్.కె సఫయాలా, బి.సూర్యనారాయణ, పి.రమేష్‌లను డీఎస్పీ అభినందించారు. అలాగే నకిలీ నోట్లు చలామణి చేస్తున్న మరో ఇద్దరిని జి.సిగడాం పోలీసులు అరెస్టు చేశారు.



# త్వరలో స్వదేశానికి.. గంగపుత్రులు

* ఆరు నెలల కిందట జిల్లా నుంచి చెన్నైకి వలస
* వేటకు వెళ్లి, అనుకోకుండా శ్రీలంక సముద్ర జలాల్లోకి
* అరెస్టు చేసిన శ్రీలంక కోస్టుగార్డులు
* విదేశాంగ శాఖతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సంప్రదింపులు
* విడుదలకు అంగీకరించిన శ్రీలంక ప్రభుత్వం
* పెదగనగళ్లవానిపేటలో కుటుంబీకుల ఆనందం

**శ్రీకాకుళం, డిసెంబర్ 13 (వార్త):** శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించి, గత ఆరు నెలలుగా అక్కడి జైల్లో మగ్గుతున్న జిల్లాకు చెందిన మత్స్యకారులు తిరిగి స్వదేశానికి త్వరలో చేరుకోనున్నారు. ఈ మేరకు శ్రీలంకలోని భారత ఎంబసీ కార్యాలయం నుంచి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కార్యాలయానికి శుక్రవారం సమాచారం అందింది. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం రూరల్ మండలం పెద గనగళ్లవానిపేటకు చెందిన మత్స్యకార యువకులు దాసరి వెంకయ్య(35), గనగళ్ల కొర్లయ్య (33) ఉపాధి నిమిత్తం జూన్ 7న చెన్నై కి వలస వెళ్లారు. అక్కడి నుంచి జూన్ 25న మొత్తం 8మంది కలిసి, బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. అయితే సరిహద్దులు తెలియక శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించడం, ప్రమాదవశాత్తు మరో బోటును ఢీ కొట్టడంతో అక్కడి కోస్టుగార్డు పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై 15 రోజుల తరువాత కర్ణాటకకు చెందిన మత్స్యకార సంఘానికి విషయం తెలియగా.. వారు బాధిత కుటుంబాలకు సమాచారం అందించారు. దీంతో స్థానిక నాయకులు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్




తదితరులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు.

**విదేశాంగ శాఖతో రామ్మోహన్ నాయుడు సంప్రదింపులు..**

జిల్లాకు చెందిన ఇద్దరు మత్స్యకారులు అనుకోకుండా శ్రీలంక కోస్టుగార్డు కు చిక్కు కోవడంతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ వెంటనే స్పందించారు. బాధిత కుటుంబాలకు బియ్యం, రేషన్ సరుకులు అందజేశారు. అలాగే విదేశాంగ శాఖ మంత్రి ఎన్.జైశంకర్‌ను కలిసి, మత్స్యకారులను స్వదేశానికి చేరుకునేలా చొరవ చూపాలని కోరారు. అలాగే భారత ఎంబసీకి సమాచారం అందించారు. ఈ మేరకు జరిగిన సంప్రదింపులు కొలిక్కి రావడంతో.. గంగపుత్రులను విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కోర్టులో న్యాయ ప్రక్రియ పూర్తయిన కొద్ది రోజుల్లోనే మత్స్యకారులను ముందుగా కొలంబోకు, అక్కడి నుంచి విమానంలో స్వదేశానికి చేర్చనున్నట్లు సమాచారం అందించారు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు, పెద గనగళ్లవానిపేట నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై చొరవ చూపిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడే జాతీయ లోక్ అదాలత్

**శ్రీకాకుళం, డిసెంబర్ 13(వార్త):** జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా కోరారు. జిల్లాలో శనివారం 19 బెంచీలు నిర్వహించనున్నామన్నారు. క్రిమినల్, సివిల్ కేసులను రాజీ చేయనున్నామన్నారు. లీగల్ సర్వీసులు ప్రజల వద్దకు చేరేలా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్స్ ద్వారా పారా లీగల్ వలంటీర్స్ నియమించామని తెలిపారు.



# ఎయిర్‌పోర్టుకు బలవంతపు భూసేకరణ వద్దు

### -వామపక్షాల డిమాండ్




**మందస, డిసెంబర్ 13(వార్త):** మందస, వజ్రపుకొత్తూరు మండలాల తీర ప్రాంత భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరిట బలవంతపు భూసేకరణను ప్రభుత్వం రద్దు చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో శుక్రవారం ఆ పార్టీ నేతలు పర్యటించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించారు. ఒంకులూరు, బిడిమి, రాంపురం, గంగువాడ, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో రైతుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టొద్దని కోరుతూ ఆ గ్రామాల్లో ప్రదర్శనలు, సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి పాలకులు పూనుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తిని కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తున్నారని విమర్శించారు. దీంతో ప్రజల జీవన విధానం ధ్వంసమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార ఆధునికీకరణకు రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెరిగి, వలసలు తగ్గుతాయని, జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అభివృద్ధా..ప్రజల అభివృద్ధా ప్రభుత్వం తేల్చుకోవాలన్నారు. ఏపీని అదానీ ప్రదేశ్‌గా ప్రభుత్వం మార్చేస్తోందని ఆరోపించారు. కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి..ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ పలాస కార్యదర్శి చాపర వేణుగోపాల్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పలు ప్రజా సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, సార జగన్, రాపాక మాధవరావు, బర్ల గోపి, జె.వీరాస్వామి, ఎం.వినోద్ కుమార్,కె.మోహనరావు, పి.ఆరేలమ్మ, గణపతి, ఎం.రామారావు, పి.కామేశ్వరరావు, టి.అజయ్, ఎం.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 13(వార్త):** ఇచ్ఛాపురం మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఇరిగేషన్, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సున్నితమైన, అంత్యంత సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఎన్నికలను శనివారం సజావుగా జరపాలన్నారు. సమావేశంలో ఎస్ఐ చిన్నంనాయుడు, రూరల్ హెచ్‌సీ భోజరాజు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ సంస్థాగత బలోపేతానికి కృషి

**శ్రీకాకుళం, డిసెంబర్ 13(వార్త):** బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన పీఎన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బూత్‌స్థాయి కమిటీలు నియమిస్తున్నామన్నారు. పీఎన్ కాలనీకి సంబంధించి 118వ బూత్ కమిటీ అధ్యక్షురాలిగా ఎ.మీనాక్షి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. 12 మందితో కమిటీ వేశామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.



# మొక్కలు నాటండి..పరిరక్షించండి

**మందస, డిసెంబర్ 13(వార్త):** ప్రతీ విద్యార్థి విధిగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, పరిరక్షించాలని కొత్త పల్లి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధా నోపాధ్యాయుడు ఎస్.గణేశ్వరరావు కోరారు. పాఠశాలలో పదో తరగతి చదు వుతున్న పైల కీర్తన శుక్రవారం తన జన్మదినం సందర్భంగా కొబ్బరి మొక్కను బహుకరించగా, దానిని ఆ విద్యార్థి నితో పాఠశాల ఆవరణలో నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తనను స్ఫూర్తిగా తీసుకొని మిగి లిన విద్యార్థులు కూడా పర్యావరణ పరి రక్షణకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్ర సేను, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.





## బహడపల్లిలో నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు

**మందస, డిసెంబర్ 13(వార్త):** బహడపల్లి పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12లక్షలు దుర్వినియోగంపై శుక్రవారం ఆ గ్రామంలో టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి గోపిబాల విచారణ చేపట్టారు. గ్రామ కమిటీ సమక్షంలో పంచాయతీ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీని విచారించారు. విత్ డ్రా చేసిన నిధులకు, వాస్తవ పనులకు ఎక్కడా పొంతన లేకపోవడంతో డీపీవోకు ఫిర్యాదు అందినట్టు ఆయన తెలిపారు. ఈ విచారణకలు సర్పంచ్ ప్రతినిధి బొడ్డు ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎన్.మోహనరావు, మాజీ ఎంపీటీసీ సాలిన మాధవరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాలిన ఉమాపతి, సాలిన జానకిరావు, సార పురుషోత్తం, కర్రి తాతారావు, రాపాక కేశవరావు, మామిడి కృష్ణారావు తదితరులు హాజరయ్యారు.

## మెగా ఆర్గానిక్ మేళా ప్రారంభం



**వంగర, డిసెంబర్ 13(వార్త):** వైజాగ్ ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో శుక్రవారం మెగా ఆర్గానిక్ మేళా ప్రారంభించినట్లు వంగర మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు పెంకి గౌరీశ్వరరావు తెలిపారు. ప్రజల ఆరోగ్య జీవనానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు దోహదపడతాయన్నారు. దీంతో ఈ మేళాను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేళాలో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన ప్రకృతి వ్యవసాయ రైతులు సుమారు 200 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## పెళ్లికానుక అందజేత



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 13(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 22వ వార్డు కౌన్సిలర్ సొంత నిధులతో పెళ్లి కానుక అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేద యువతుల వివాహానికి ఆయన రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా పోతులంక శ్రీను కుమార్తె మహాలక్ష్మి వివాహం నిమిత్తం నగదు అందజేశారు. కార్యక్రమంలో కాళ్ల కృష్ణ, కాళ్ల దేవా యాదవ్ పాల్గొన్నారు.

## కూటమి పాలనపై ప్రజల్లో ఆనందం

**వంగర, డిసెంబర్ 13(వార్త):** కూటమి పాలనపై అన్ని వర్గాల ప్రజలు ఆనందంతో ఉన్నారని వంగర మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావునాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మెట్టమగ్గూరుకు ఓ శుభకార్యానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజాహిత పాలనందిస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, నారా లోకేష్ అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రజానీకానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గంటా నారాయణస్వామి, వేగిరెడ్డి రాము, దత్తి పరిసినాయుడు, అన్నపూర్ణమ్మ, భవాని, కాశిమ్మ, నూర్జహాన్, రామారావు తదితరులు ఉన్నారు.



# జిల్లాలో 16న ఎస్సీ ఉప వర్గీకరణ కమిషన్ పర్యటన

**శ్రీకాకుళం, డిసెంబర్ 13(వార్త):** షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా (రిటైర్డ్ ఐఏఎస్) ఈనెల 16న జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న ఉదయం 10 గంటలకు ఆయన జిల్లాకు చేరుకుంటారన్నారు. 11 గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. అనంతరం దళిత కులాలకు చెందిన ఉద్యోగులు, కుల సంఘ నాయకులు, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై కమిషన్‌కు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## 18.5 కిలోల గంజాయి సీజ్

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 13(వార్త):** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బోర్డర్ మొబైల్ పార్టీ సీఐ జీవీ రమణ శుక్రవారం 18.5 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు స్టేషన్ సీఐ పీడీ ప్రసాద్ తెలిపారు. పురుషోత్తపురం వద్ద తనిఖీలు నిర్వహించగా చందన్ కుమార్ మహంతి తన ద్విచక్ర వాహనంపై ఈ గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డార న్నారు. ఆయనను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు




**రాజాం, డిసెంబర్ 13(వార్త):** రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలసలో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా, ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నట్టు మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఆ గ్రామంలో పర్యటించారు. నిరుపయోగంగా ఉన్న చేతి పంపులకు మరమ్మతులు చేయించారు. వేసవిలో నీటికి ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన చోట చేతి పంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు సకాలంలో చేపట్టి, నీటిని నిరాటంకంగా సరఫరా చేస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా బాలకృష్ణ



**కోటబొమ్మాళి, డిసెంబర్ 13(వార్త):** కోటబొమ్మాలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్ సమక్షంలో పంచాయతీ కార్య దర్శుల సంఘ కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు అధ్యక్షుడిగా బి.బాలకృష్ణ, ఉపా ధ్యక్షుడిగా బి.నరేష్, జనరల్ సెక్రటరీగా ఆర్.భాస్కర్, ట్రెజరర్‌గా వి.రమేష్, ముఖ్య సలహాదారులుగా సీహెచ్.లచ్చయ్య, గౌరవ అధ్యక్షులుగా చింతాడ సన్యాసి తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## వైభవంగా లక్ష దీపారాధన



**సంతబొమ్మాళి,డిసెంబర్ 13(వార్త):** సంతబొమ్మాళిలోని పంచముఖాంజనేయస్వామి, గోదావరి పోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో శుక్రవారం లక్ష దీపా రాధన కన్నుల పండువగా జరిగింది. హనుమాన్ భక్తులు ఈ కార్యక్రమాన్ని గ్రామస్తుల సహకారంతో ఏటా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మహిళా భక్తులు ఈ కార్యక్రమంలో ఎక్కువగా పాల్గొన్నా రు. హనుమాన్, దుర్గామాత దీక్షా భక్తు లు, గోదావరి, పోలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు, యువతీ, యువకులు సేవలందించారు.

# కనిపిస్తే జాగా..వేసేయ్ పాగా..!

**-పలాసలో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా**
**-చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం**



**పలాస,డిసెంబర్ 13(వార్త):** పలాస - కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. అక్రమార్కులు కోట్లాది రూపాయల విలువ గల ప్రభుత్వ భూములు కబ్జా చేసినప్పటికీ సంబంధిత రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాశీబుగ్గలో భూముల ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో భూబకాసురుల దందాకు పాల్పడి పబ్బం గడుపుకుంటున్నారు. కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలో ఇండస్ట్రియల్ ఏరియాకు ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న వరద కాలువ ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుంది. సుమారు రూ.అరకోటి విలువ గల వరద కాలువ కబ్జాకు గురికావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంకుమ సాగర్ చెరువుకు వెళ్లే 20 అడుగుల వెడల్పు గల భారీ వరద కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న అక్రమార్కులు ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ, పోరంబోకు, డీ పట్టా భూములను భూఆక్రమణదారులు ఆక్రమించి గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుంకుమ సాగర్ చెరువుకు ఆనించి కొంత భాగాన్ని ఆక్రమించుకున్న ఆక్రమణదారుల గత ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో రెవెన్యూ యంత్రాంగానికి ముడుపులు చెల్లించి డీ పట్టాలు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరద కాలువను ఆక్రమించిన భూ కబ్జాదారులు ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేస్తూ భూదోపిడీకి పాల్పడుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారే తప్ప కనీసం చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ, డీ పట్టా, పోరంబోకు భూములే లక్ష్యంగా అక్రమార్కులు కబ్జాకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఎకరా భూమి సుమారుగా రూ.10 కోట్లు పలుకుతుండడంతో ప్రభుత్వ భూములను కబ్జా చేసి కొట్టేస్తున్న ఆక్రమణదారులు వాటిని స్థలాలుగా మార్చి విక్రయించేందుకు సిద్ధడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పలాసలో వరద కాలువలను పరిరక్షించాలని, ప్రభుత్వ భూముల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ భూములకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఉద్యోగమేళాలో 18మంది ఎంపిక

**పలాస, డిసెంబర్ 13(వార్త):** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పలాసలోని డాక్టర్ వి కణితీస్ ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ మినీ జాబ్‌మేళాకి వివిధ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటికి 51 మంది హాజరుకాగా, 18 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ మాట్లాడుతూ జాబ్‌మేళాకి హాజరైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ ఉద్యోగాల కోసం తిరగాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థవారి ఆధ్వర్యంలో కంపెనీలే వచ్చి అభ్యర్థులను ఎంపిక చేసుకునేలా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ రవికుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా..దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు.ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో మానికి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డి.దిలీప్ కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సోమే శ్వరరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.




# 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

**కోటబొమ్మాళి, డిసెంబర్ 13(వార్త):** తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లి పరిష్కరించాలని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్‌ను 104 ఉద్యోగులు కోరారు. శుక్రవారం వారు ఎంపీడీవో కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. 16 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభు త్వం అరబిందో యాజమాన్యంతో చర్చించి తమకు రావాల్సిన ఆర్థిక ప్రయో జనాలన్నీ కూడా సత్వరం ఇప్పించాలని కోరారు. 14 రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని, అప్పటికీ తమ సమస్యలు పరిష్కరించకుంటే అందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.



## ఈదుపురంలో క్రిస్మస్ సంబరాలు



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 13(వార్త):** ఈదుపురం ఒడియా బాపిస్టు చర్చిలో శుక్ర వారం ఒడియా ఫాస్టర్స్ క్రిస్మస్ సంబరాలు జరిపారు. భీమ్ బెహరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ పాల్గొని 35 మంది పాస్టర్‌లకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఏలియా, సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమత్ వ్రతాలు

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 13(వార్త):** ఇచ్ఛాపురంలోని కోదండరామ ఆలయంలో శుక్రవారం సామూహిక హనుమత్ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. పద్మకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో 28 మంది ఈ వ్రతం ఆచరించారు.

కార్యక్రమంలో దక్కత గోపి, పల్లంటి చిరంజీవి, ఉల్లి రామోజీరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కబేళాకు తరలిస్తున్న ఆవులు పట్టివేత

**ఆమదాలవలస, డిసెంబర్13 (వార్త):** పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని పార్వతీశంపేట వద్ద అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఆవులను పట్టుకున్నట్టు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం కొత్తూరు మండలం బలద సంత నుంచి 34 ఆవులను నిచ్చెర్ల మల్లేష్, కుప్ప త్రినాథ్, షణ్ముఖరావు, కడుం గ్రామానికి చెందిన శంకర్ తోలుకొని వస్తుండగా పార్వతీశంపేట వద్ద పట్టుకున్నామన్నారు. పట్టణంలోని ఏడో వార్డు చింతాడకు చెందిన గొంటి శేఖర్ వీటిని తరలిస్తున్నట్టు తమ విచారణలో తేలిందన్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 34 ఆవులను విజయనగరం జిల్లా గుర్లలోని గోశాలకు తరలిస్తున్నట్టు పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో
# రైతులకు అన్యాయం

* తాము అండగా ఉంటాం * రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన * వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ * నగరంలో వైసీపీ శ్రేణుల భారీ ర్యాలీ * జేసీకి వినతిపత్రం

**శ్రీకాకుళం, డిసెంబర్ 13 (వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవడంలో విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. శుక్రవారం శ్రీకాకుళం నగరంలో వైసీపీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకూ సాగింది. అనంతరం ధర్నా, ఆ తర్వాత జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలన్నారు. వైసీపీ పాలనలో రైతు భరోసా కింద రూ.13,500 ఇచ్చేవారమని, కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని గొప్పలు చెప్పిందే తప్పా ఇప్పటి వరకూ ఇవ్వలేదన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఆర్‌బీకేల్లో కొనుగోలు చేయాలని, దళారీ వ్యవస్థను రూపుమాపాలన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని అన్నారు. కూటమి ప్రభుత్వం



రైతు వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. రైతులే బీమా చెల్లించుకునే విధానం మంచిదని, దాన్ని తీసివేయడం సరికాదన్నారు. రైతులకు నష్టం చేస్తున్న ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, అంబటి శ్రీనివాసరావు, ఎం.వి.పద్మావతి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

* 365 సంఘాలకు నేడు ఎన్నికలు
* ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
* బరిలో కూటమి మద్దతుదారులు
* వైసీపీ శ్రేణులు దూరం

**శ్రీకాకుళం, డిసెంబర్ 13(వార్త):** సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా 365 సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఎన్నికలు ఈనెల 5న జరగాల్సి ఉండగా తుఫాన్ వల్ల14కు వాయిదా పడింది. ఈ ఎన్నికలకు వైసీపీ దూరంగా ఉంది. దీంతో కూటమి మద్దతుదారులే బరిలో ఉన్నారు. ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవానికి కూటమి పార్టీలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. జిల్లాలో మేజర్ వాటర్ యూజర్ అసోసియేషన్‌లు 94, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 21, మైనర్ వాటర్ యూజర్ అసోసియేషన్‌లు 250, అలాగే వంశధార, నారాయణపురం వాటర్ యూజర్స్ కమిటీలు ఉన్నాయి. 4,57,900 మంది ఓటర్లుగా గుర్తించారు. వీరిలో పురుషులు 3,42,594 మంది, మహిళలు 1,15,306 మంది ఉన్నారు. శనివారం ఉదయం ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు ఎన్నుకుంటారు. ఎన్నిక అంతా చేతులెత్తి మద్దతు తెలిపే విధానమే. ఎక్కడైనా అభ్యంతరం ఉంటే సాగునీటి రైతులు రహస్యంగా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పిస్తారు. ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, ఈనెల 20న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నిక జరుగుతుంది. దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుంది.

# ఉపాధ్యాయుడిగా.. ఎమ్మెల్యే

* విద్యార్థులకు బోధించిన ఎంజీఆర్
* వారితో కలిసి సహపంక్తి భోజనం
* ఉద్యోగులు సమయపాలన పాటించండి
* భోజనంలో నాణ్యత పాటించాలని ఆదేశం
* కొత్తూరు కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



**కొత్తూరు, డిసెంబర్ 13 (వార్త):** కొత్తూరు మండలం వసప కేజీబీవీని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను, మధ్యాహ్న భోజనమెనూను తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలువేసి



సమాధానాలు రాబెట్టారు. మధ్యాహ్నం పూట వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. భోజనం నాణ్యతపై ఆరా తీశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.



## వైసీపీ పాలనలో
# రాష్ట్రం నిర్వీర్యం

* కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* టీడీపీలో చేరిన కల్లేపల్లి గ్రామస్థులు

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్13(వార్త):** గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా నిర్వీర్యమైపోయిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరు నెలల్లోగా పాలన ఒక గాడిలోకి వచ్చిందని తెలిపారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల ఆయన కార్యాలయంలో కల్లేపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని చెప్పారు. కార్యకర్తలు ప్రజల్లో ఉండి వారికి సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూకళ్ల శ్రీను, మూకళ్ల జయానంద్, శీర రమణయ్య, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దుర్గ గుడిలో చోరీ

**ఎచ్చెర్ల, డిసెంబర్13 (వార్త):** కుప్పిలి గ్రామంలోని దుర్గ గుడిలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి పూజలకు శుక్రవారం వేకువజామున గుడి తలుపులు తెరిచేందుకు పురోహితుడు కసవ బైరాగి రాగా.. అప్పటికే తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించాడు. గర్భగుడిలోకి వెళ్లి పరిశీలించగా అమ్మవారికి అలంకరించిన నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్టు గుర్తించాడు. గ్రామ పెద్ద లకు సమాచారం ఇచ్చారు. అమ్మవారికి అలంకరించిన 30 తులాల వెండి, ఒక తులం బంగారంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకుపోయారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ తనిఖీలు



**శ్రీకాకుళం, డిసెంబర్ 13 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పాతకుంకాం గ్రామం, విజయనగరం జిల్లా కర్లం గ్రామం లో పలు ఎరువుల దుఖాణాలలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుఖాణాలలో సరుకు వ్యత్యాసాలు, కాలం చెల్లిన పురుగు మందులు అమ్మకం వంటి అవకతవకలు గుర్తించారు. రూ. 9,59,098 విలువ కలిగిన 70.545 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి సంబందిత దుఖాణాదారులపై 6(ఏ) కేసులు నమోదు చేశారు. ఈ సందర్భగా విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాద రావు మాట్లాడుతూ ఎరువుల అక్రమ వ్యాపారంపై నిఘా ఉంచామని, తనిఖీలలో పట్టుబడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

**సారవకోట, డిసెంబర్13 (వార్త):** రైతులకు సంబంధించిన భూముల సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు వేదికని తహశీల్దార్ విజయలక్ష్మి తెలిపా రు. శుక్రవారం కూర్మనాధపు రం, చరణ్‌దాస్.పురం గ్రామం లో సర్పంచ్ బొడ్డేపల్లి సుధాకర్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా అరే బాలరాజు ముఖ్యమంత్రి సందేశం చదివి వినిపించారు. సభలో తహశీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు కొన్న భూ సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టిలో పెట్టి దీని పరిష్కారం మార్గం చూపిస్తామని చెప్పారు. రైతులకు ఈ సదస్సులు ఎంతో ఉపయోగపడుతుందని, రైతుల సమస్యలు వీఆర్ఓకి వినతి పత్రాలు అందజేయలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేలు రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546